

ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఆవేదన.. అభయం!

- అమరావతిలో సీఎం పర్యటన
- వైసీపీ నిర్లక్ష్యానికి బలైన నిర్మాణాల పరిశీలన
- శంకుస్థాపన ప్రదేశంలో సాష్టాంగ నమస్కారం
- ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి పర్యటన ప్రారంభం
- రాజధాని రైతుల త్యాగాలను శ్లాఘించిన చంద్రబాబు
- ఐదేళ్ల విధ్వంసంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తానన్న ముఖ్యమంత్రి

ఆకాశాన్నితాకే నిర్మాణాలతో.. విశాలమైన రహదారులతో.. అందరూ మెచ్చేలా మొదలైన ఆంధ్రుల రాజధాని అమరావతి... గత ఐదేళ్లలో అడవిలా మారిన వైనాన్ని, శ్మశాన వైరాగ్యంలో చిక్కుకున్న తీరును చూసి చంద్రబాబు చలించిపోయారు. ఐదేళ్లుగా రహదారులు, భవనాలు జగన్ నిర్లక్ష్యానికి బలైపోవడం చూసిన నవ్యాంధ్ర రాజధాని సృష్టికర్త చంద్రబాబు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో అమరావతిని అభివృద్ధి పథాన నడిపించాలన్న దీక్ష తన పర్యటనలో కనబరిచారు. గురువారం అమరావతి ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన.. తాను శంకుస్థాపన చేసిన ప్రదేశంలో సాష్టాంగ నమస్కారం చేశారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వెంటాడిన విధ్వంసక పీడనను, కమ్ముకున్న నిశ్శబ్దాన్ని, అలుముకున్న చీకట్లను అధిగమించి అమరావతిని అభివృద్ధి పథాన నడిపిస్తానని రాజధానివాసులకు అభయమిచ్చారు. ఐదేళ్ల విధ్వంసంపై శ్వేతపత్రం విడుదల చేస్తానని సీఎం ప్రకటించారు.



- వైసీపీ నాయకుల భూ ఆక్రమణలపై చర్యలకు సిద్ధమైన ప్రభుత్వం
- మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కనే కబ్జాలు
- ఎకరం రూ.5 కోట్లకుపైనే ధర
- పేదల ఇళ్లస్థలాల పేరుతో ఆక్రమణ
- ఈ భూమిలో గతంలో స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన
- కాంట్రాక్టరును బెదిరించి పంపేసిన వైసీపీ నాయకులు



జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆక్రమిత భూమిలో వెలసిన రేకుల షెడ్లు

కబ్జాలపై సర్కారు గురి

వైసీపీ నాయకులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి 65 పక్కనే ఉన్న కోట్లాది రూపాయల విలువైన భూమిని ఆక్రమించేశారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో కొనసాగిన ఈ భూదందా వెనుక కోట్లాది రూపాయల కుంభకోణం నడిచింది. జాతీయ రహదారి పక్కనే విలువైన భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇస్తామని చెప్పి వైసీపీ నాయకులు తమ అనుచరులతో రేకుల షెడ్లు కూడా వేయించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా భూమిని ఇళ్ల స్థలాలుగా విభజించి అక్రమించేసినా అప్పట్లో అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ భూమి ఆక్రమణపై విచారణ చేసి వైసీపీ నాయకుల అక్రమాలను వెలికి తీసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. విలువైన ప్రభుత్వ భూమిని ఖాళీ చేయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కనే పట్టణ ముఖద్వారంలో ఆర్ఎస్ నెంబరు 179, 180, 181లలో 26 ఎకరాల భూమి ఉంది. వంద కోట్లకుపైగా విలువైన ఈ భూమిని వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యూహాత్మకంగా రెండు సంవత్సరాల వ్యవధిలో విడతల వారీగా ఆక్రమిస్తూ వచ్చారు. తొలుత పదెకరాల భూమిని ఆక్రమించి తమ అనుయాయులతో రేకుల షెడ్లు వేయించారు. ఈ రేకుల షెడ్ల వెనుక వైపున భూమిలో ఎవ్వరూ వెళ్లకుండా దారులు మూసేశారు. ఈ భూమి లోపలికి ఎవరూ ప్రవేశించకుండా తమ మనుషులతో నిఘా ఉంచారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే 26 ఎకరాల భూమిని తమ సొంతం చేసుకునేందుకు భూమిని తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఎన్నికల ముందు ఇక్కడి రేకుల షెడ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు అనుమతులు వచ్చాయి. పురపాలక సంఘం నిధులతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. ఈ స్థలం మధ్యలో సిమెంటు రోడ్లను కూడా నిర్మాణం చేశారు.

మునిసిపల్ నిధులతో మెరక

మచిలీపట్నం శివారు కుమ్మరిగూడెం సమీపంలో మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కనే విలువైన భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇస్తామనే సాకు చూపి ఆక్రమించిన భూమిలో మచిలీపట్నం డంపింగ్ యార్డు నుంచి చెత్తను తరలించి రెండేళ్ల క్రితం మెరక చేశారు. అంతటితో ఆగకుండా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మెరక పనుల నిమిత్తం అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.10 లక్షల వరకు బిల్లులు కూడా చేసుకున్నారు. 26 ఎకరాల భూమిలో 10 ఎకరాలను మెరకచేసి మిగిలిన భూమిని చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. మెరక చేసిన భూమిలో ఇద్దరు వైసీపీ నాయకులు పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తామంటూ లక్షలాది రూపాయలను తమ అనుయాయులతో వసూలు చేయించారు. నగదు చెల్లించిన వారితో తాత్కాలికంగా రేకులషెడ్లు వేయించారు. ఈ భూమిని పేదలకు ఇళ్లస్థలాలుగా ఇచ్చేందుకు ఎలాంటి ప్రతిపాదనలూ లేవని, ఆక్రమించవద్దని అధికారులు చెబుతున్నా వైసీపీ పెద్దలు తమ ఆక్రమణ పర్వాన్ని కొనసాగించారు.

స్టేడియం నిర్మాణాన్ని అడ్డుకుని..

మచిలీపట్నం నగరం శివారున ఉన్న కుమ్మరిగూడెం వాసులకు 1960లో 26 ఎకరాల భూమిని కేటాయించారు. మట్టిని తవ్వి తీసుకువెళ్లి కుండలు, ఇతరత్రా పరికరాలు తయారు చేసుకునేందుకు అప్పట్లో అనుమతులు ఇచ్చారు. ఈ భూమిని వారు వినియోగించుకోకపోవడంతో భూమి ఖాళీగానే ఉంటోంది. ఈ భూమి జాతీయ రహదారి పక్కనే ఉండటం వందల కోట్ల విలువ పలుకుతుండటంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ పెద్దలు ఈ భూమి ఆక్రమణకు దిగారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్రణాళికను రూపొందించింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకులు కుమ్మరిగూడెం వాసులను రెచ్చగొట్టి ఉద్యమాలు చేయించి స్టేడియం నిర్మాణాన్ని అడ్డుకున్నారు. గోసంఘం వద్ద స్టేడియం నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం 12 ఎకరాల భూమిని కేటాయించి 2019లో శంకుస్థాపన చేస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ నిర్మాణాన్నీ అడ్డుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జాతీయ రహదారి పక్కనే కోట్లాది రూపాయల విలువైన భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించిన అంశంపై విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. మాజీమంత్రి పేర్ని నాని సూచనలతో వైసీపీకి చెందిన ఒక మాజీ డెప్యూటీ మేయర్, ప్రస్తుతం మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో కీలక పదవిలో ఉన్న నాయకుడి కనుసన్నల్లో ఈ భూమి ఆక్రమణ జరిగింది.



తెంచేస్తున్నారు!

జిల్లాలో మళ్లీ మొదలైన చైన్ స్నాచింగ్‌లు

- ఒంటరి మహిళలే టార్గెట్
- వణుకుతున్న మగువలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కృష్ణాజిల్లాలో చైన్ స్నాచర్లు చెలరేగుతున్నారు. కొంతకాలంపాటు స్నాచింగ్‌లకు బ్రేక్ ఇచ్చిన దొంగలు మళ్లీ చేతికి పని చెబుతున్నారు. తాజాగా గుడివాడలో జరిగిన ఘటనే దీనికి నిదర్శనం. జాజుల లక్ష్మి అనే వృద్ధురాలు బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రావడానికి ఆటో ఎక్కింది. పామర్రు రోడ్డులో ఉన్న బ్యాంక్ కాలనీ వద్ద ఆటో దిగి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై ఆమె ముందు నుంచి కొంతదూరం వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వెనక్కి వచ్చి నారాయణరావు అనే వ్యక్తి ఇంటికి చిరునామా అడిగారు. తనకు తెలియదని చెప్పి ముందుకు వెళ్తుండగా ఆమె మెడలో ఉన్న మూడు కాసుల బంగారం గొలుసును లాక్కుని వేగంగా వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఆమె చెవి భాగం కోసుకుపోయింది. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఫుటేజీలో స్పష్టత లేదని తెలుస్తోంది. దీనిపై గుడివాడ రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటరిగా వెళ్లే వారిని గుర్తించి...

కొన్నేళ్ల క్రితం కృష్ణాజిల్లాను స్నాచర్లు గజగజలాడించారు. బైక్‌లపై తిరుగుతూ ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని గొలుసులు లాక్కుపోయేవారు. వేసవి సెలవులు ముగిసి విద్యాసంస్థలు తెరుచుకోవడంతో స్నాచింగ్‌లకు దిగుతున్నారు. పిల్లలను తల్లులు స్కూళ్ల నుంచి ఇళ్లకు తీసుకెళ్తుంటారు. ఇలాంటి పరిస్థితులను వారు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఈ స్నాచర్లు స్థానికంగా ఉండే యువకులా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లా అన్నది స్పష్టత లేదు. విలాసాల కోసం కొందరు, ప్రియురాళ్ల అవసరాలను తీర్చడానికి మరికొందరు ఈ స్నాచింగ్‌లు చేస్తున్నట్టు కొంతమంది నేరగాళ్ల విషయంలో తేలింది. కొన్నిచోట్ల పొరుగున ఉన్న పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఈ స్నాచింగ్‌లు చేసి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇలా చైన్ స్నాచింగ్‌లు చేస్తూ పట్టుబడిన కొంతమంది కొన్నాళ్ల క్రితం జైలు నుంచి విడుదలైనట్టు సమాచారం. ఈ పాత నేరగాళ్లు మళ్లీ పుంజుకుంటున్నారు. ప్రస్తుతం పోలీసులపై ఇంకా ఎన్నికల వేడి పనిచేస్తోంది. బయట గస్తీల కంటే రాజకీయ నేతల ఇళ్ల వద్ద పికెట్‌లకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. పోలీసులు బిజీగా ఉంటున్నారన్న విషయాన్ని పరిశీలించుకుని స్నాచింగ్‌లకు దిగుతున్నారు. రెండు, మూడు రోజులపాటు పక్కాగా రెక్కీ నిర్వహించిన తర్వాత ఒంటరి మహిళల మెడలో గొలుసులు తెంపేస్తున్నారు. దీనితో మహిళలు, వృద్ధులు ఒంటరిగా అడుగు బయట వేయడానికి భయపడుతున్నారు.

టమాటా రేటు.. ఉల్లి ఘాటు..!

- రైతుబజార్‌లో కిలో టమాటా రూ.64
- బయటి మార్కెట్‌లో రూ.80పైనే
- తమిళనాడుకు తరలిపోతున్న సరుకు
- ఇక్కడి మార్కెట్‌లో తీవ్ర కొరత
- కిలో రూ.36 పలుకుతున్న ఉల్లిపాయలు

టమాటాలు, ఉల్లిపాయలు ధరలో పోటీ పడుతున్నాయి. టమాటా ధరలు పెరగడానికి సహేతుక కారణాలే ఉన్నా.. ఉల్లి ధరలు ఎందుకు పెరుగుతున్నాయో అర్థంకాని పరిస్థితి. రైతుబజార్‌లో ప్రస్తుతం టమాటా కేజీ రూ.64 పలుకుతుండగా, ఉల్లిపాయలు రూ.36కు చేరుకున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ఉల్లికి కృత్రిమ కొరత?



టమాటాతో పాటు ఉల్లి ధరలూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో ఉల్లి రూ.36 పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.40కు విక్రయిస్తున్నారు. రాష్ట్రానికి మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి అవుతుంది. ఇంతకుముందు కురిసిన వర్షాలకు రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, నంద్యాల ప్రాంతాల్లో ఉల్లి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. తర్వాత మళ్లీ పంటలు వేసినా సెప్టెంబరు వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. దీంతో ఉల్లి దిగుమతికి మహారాష్ట్ర దిక్కైంది. రాష్ట్రంలో సరుకు పుష్కలంగా అందుబాటులో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కేవలం కృత్రిమ కొరత కారణంగానే ఈ ధరలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం వరకు బయట దుకాణాల్లో రూ.100కు ఐదు కిలోలు ఇచ్చేవారు. ఆ తర్వాత రూ.100కు నాలుగు కేజీలు ఇచ్చారు. ఇప్పుడు మూడు కేజీలకు పరిమితం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభంకావడంతో ఉల్లి ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు లీకులు ఇస్తున్నారు.

తమిళనాడుకు టమా..టా..



రాష్ట్రం మొత్తానికి టమాటా మదనపల్లి మార్కెట్ నుంచి దిగుమతి అవుతుంది. దీంతో పాటు పుంగనూరు, అనంతపురం నుంచి సరఫరా అవుతుంది. రాష్ట్రంలో ఉన్న అన్ని మార్కెట్లకు ఈ మూడు ప్రాంతాల నుంచే సరుకు సరఫరా అవుతుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు సరఫరా అయిన టమాటా ఇప్పుడు తమిళనాడు వైపు చూస్తోంది. ఆ రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు మొత్తం టమాటా పంట నష్టపోయింది. దీంతో అక్కడికి టమాటాను ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి కంటే ఎక్కువ ధర లభిస్తుండటంతో వ్యాపారులు తమిళనాడు వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఆ ప్రభావం విజయవాడ పరిసర ప్రాంతాలపై పడుతోంది. ప్రస్తుతం రైతుబజార్లలో కిలో టమాటాను రూ.64కు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.90 పలుకుతోంది. ఇంకో రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగే సూచనలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. బయట మార్కెట్‌లో రూ.100కు చేరుతుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో టమాటా పంట ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అందుబాటులోకి వస్తుంది.

దుర్గగుడిలో తగ్గిన బంగారం

- రిజిస్టర్‌లో తక్కువగా నమోదైన అమ్మవారి బంగారం
- ఈవో, ఏఈవో మధ్య వాగ్వాదం
- ఈవోకు లెటర్ అందజేసిన ఏఈవో
- సరైన సమయం కాదని పక్కన పడేయడంతో గొడవ

వన్‌టౌన్, జూన్ 20 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ఈవో కేఎస్ రామారావు, ఏఈవో సుధారాణి మధ్య గురువారం వాగ్వాదం చోటుచేసుకుంది. దుర్గమ్మకు భక్తులు సమర్పించిన హుండీల్లోని కానుకల లెక్కింపు గురువారం ఇంద్రకీలాద్రిపై జరగ్గా, అదే సమయంలో వీరిద్దరూ ఆవేశంగా మాట్లాడుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రిజిస్టర్‌లో నమోదు చేసిన బంగారం తక్కువగా ఉందని సంబంధిత విభాగ ఏఈవో సుధారాణి బంగారం మదింపుదారుడు (గోల్డ్ అప్రైజర్) దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విషయాన్ని ఈవోకు చెప్పడంతో దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేఈవో)ను దేవస్థానానికి పిలిపించి వెరిఫికేషన్ చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెలలో వచ్చి బంగారాన్ని పరిశీలిస్తానని జేఈవో చెప్పారు. కాగా, గురువారం మహామండపం ఆరో అంతస్థులో హుండీల్లోని కానుకల లెక్కింపులో ఉన్న ఈవోకు ఏఈవో సుధారాణి గోల్డ్, సిల్వర్ రిజిస్టర్‌లో బంగారం తగ్గిందని పేర్కొంటూ ఓ లెటర్‌ను ఇచ్చారు. కాపీ టూ.. సీఎం, దేవదాయ శాఖ మంత్రి, దేవదాయ శాఖ కమిషనర్ అని జత చేశారు. ఈ లేఖను పరిశీలించిన ఈవో సీఎం, మంత్రి, కమిషనర్‌లకు లేఖ ఎందుకని, జేఈవో వచ్చే నెలలో వస్తారని, అప్పటి వరకు ఆగమని ఆమెకు సూచించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఆవేశంగా ఈవో ఆ లెటర్‌ను పక్కన పడేశారు. అనంతరం ఏఈవో సుధారాణి లెటర్‌ను సీఎం, దేవదాయ శాఖ మంత్రి, దేవదాయ శాఖ కమిషనర్, ఈవోకు మెయిల్ ద్వారా పంపినట్లు తెలిసింది.



బందరులోని రెవెన్యూ కల్యాణమండలంలో జన్మదిన వేడుకలో కేక్‌కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

జన్మదిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం నియోజకవర్గాన్ని కేంద్రం సాయంతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ కల్యాణ మండపంలో గురువారం రాత్రి కొల్లు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 6లో..

విమానాశ్రయ విస్తరణ పనులపై కలెక్టర్ ఆరా..

6లో..

పరిహారం ప్రకటిస్తేనే రహదారికి భూములిస్తాం

అధికారులకు తేల్చి చెప్పిన వేలేరు రైతులు

దుర్గమ్మ హుండీ కానుకల లెక్కింపు

16 రోజులకు రూ.3.23 కోట్లు

వన్‌టౌన్, జూన్ 20 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. 16రోజులకు గాను రూ.3,23,75,523లు సమకూరింది. సగటున రోజుకు రూ.20,23,470లు కానుకల రూపంలో రాగా రికార్డు స్థాయిలో రోజువారీ హుండీ ఆదాయం పెరిగినట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. బంగారం 694 గ్రాములు, వెండి 6కిలోల 264 గ్రాములు వచ్చాయి. 516 యూఎస్ డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 1000 కొరియా ఓన్‌లు, 40 ఇంగ్లండ్ పౌండ్లు, 100 ఓమన్ బైస్సాలు, 17 కెనడా డాలర్లు, 25 యూఏఈ దీర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 2 సింగపూర్ డాలర్లు సమకూరాయి. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ.59,380లు ఆదాయం వచ్చింది. ఈవో రామారావు, దేవదాయశాఖ అధికారులు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సేవలో రఘురామకృష్ణంరాజు



రఘురామకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు

మోపిదేవి/అవనిగడ్డ, జూన్ 20: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజు గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందజేశారు.

సుపరిపాలన రావాలని..

భాషా.. ద్వేష పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం సఫలమైందని ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం అవనిగడ్డకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. రఘురామ మీడియాతో మాట్లాడారు. తెలుగుభాష, రాజ్యాంగ హక్కులు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణ కోసం గత ప్రభుత్వంపై తాను చేపట్టిన పోరాటం ఫలించిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం సుపరిపాలన అందించేలా భగవంతుని ఆశీస్సులు లభించాలని కోరారు.

పవన్‌కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దంపతుల శుభాకాంక్షలు



వన్‌టౌన్, జూన్ 20 : ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఢిల్లీరావుతో పాటు ఆయన సతీమణి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ పి.ప్రశాంతి వచ్చి అభినందనలు తెలిపారు.

ఏపీ-పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు

గుడ్లవల్లేరు, జూన్ 20 : గుడ్లవల్లేరు వి.వి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ బి.ఫార్మసీ కళాశాలలో బిఫార్మసీ పూర్తి చేసిన 40 మంది విద్యార్థులు ఏపీ-పీజీ సెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. 100 లోపు ఐదుగురు, 1000 లోపు 18 మంది, 2000 లోపు 17 మంది ర్యాంక్‌లు సాధించారన్నారు. కె.సాంబయ్యకు 43వ ర్యాంకు, సీహెచ్ సువర్ణకు 57వ ర్యాంక్, ఎం.నరసింహారావుకు 68వ ర్యాంక్, ఎం.కుసుమ సిరి 88, సీహెచ్ రాంపండు 99వ ర్యాంక్‌లు సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

జలవనరుల సంరక్షణ

అందరి బాధ్యత

ఉయ్యూరు, జూన్ 20: నీటిని వృథా చేయకుండా భావితరాల కోసం జలవనరులను సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉం దని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు పి.శ్రీని వాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో చివరిరోజైన గురువారం నీటి సంరక్షణ, పొదుపు, వృథాపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని, మొక్కలు నాటి సంరక్షించాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

- పీఎన్‌బీఎస్‌లో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన
- ప్రయాణికులు, కార్మికుల సమస్యలపై ఆరా



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రవాణాశాఖ మంత్రి

బస్సుస్టేషన్, జూన్ 20 : ఆర్టీసీకి కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్లు అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రత్యేక బృందంతో అధ్యయనం చేయించి వీలైనంత త్వరలో అమలు చేస్తామన్నారు. కర్ణాటక, తెలంగాణలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలవుతోందని, స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేస్తానని పేర్కొన్నారు.

కొత్త బస్సుల కొనుగోలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. విద్యుత్ బస్సులను ఎక్కువగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ ఆస్తులను దుర్వినియోగం చేసినా, అన్యాక్రాంతం చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వీలైనంత త్వరగా సంస్థ అప్పులను తీర్చడంతో పాటు ఆర్టీసీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో ఆర్టీసీ అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికులను మంత్రి పలకరించి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిపార్చర్ బ్లాక్, సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్‌లు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. దూర ప్రాంత ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హోటల్ యాజమానులకు సూచించారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని మరో నెలలో నెరవేరుస్తామని, మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించడానికి విస్తృత ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. కార్గో కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రిని అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, సభ్యులు సత్కరించారు. డీజీపీగా పదోన్నతి పొందిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం, పీఎంబీఎస్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్, బస్సుస్టేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో రాజీపడం

- తాడిగడప కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు, జూన్ 20: తాడిగడప మునిసిపాలిటీలో పారిశుధ్య పనుల నిర్వహణపై రాజీపడే ప్రసక్తే లేదని కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మునిసిపాలిటీలోని పోరంకి ప్రభునగర్‌లో గాలులకు పడిపోయిన చెట్ల తొలగింపును పరిశీలించారు. తాడిగడప మెయిన్‌రోడ్డు, రామ్‌నగర్ కట్ట, శ్రీనివాసనగర్ కట్ట, లిమ్రా కాలనీల్లో ఆయన పర్యటించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కానూరు సర్కిల్‌లో అన్న క్యాంటీన్ స్థల, నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మునిసిపాలిటీలోని పనులపై టీడీపీ సీనియర్ నాయకులు అను మోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, తుమ్మల రాంకుమార్, శొంఠి శివరాంప్రసాద్, ఏసీపీ మురళీగౌడ్‌తో చర్చించారు.



పోగొట్టుకున్న బ్యాగ్‌ను కనుమూరుకు చెందిన మహేశ్‌కు అందజేస్తున్న ఉయ్యూరు పట్టణ పోలీసులు

ప్రభుత్వ కార్యాలయాల్లో

జగన్ ఫొటోలు తొలగించాలి

- కలెక్టర్ డీకే బాలాజీకి తెలుగురైతు నేత మద్దాలి సాయిబాబు వినతి

కంకిపాడు: ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోలను తొలగించాలని కలెక్టర్ డీకే బాలాజీని తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయిబాబు కోరారు. అనంతరం విలేకరులతో సాయిబాబు మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ఘోర ఓటమి పాలైందన్నారు. అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా జగన్ ఫొటోలు ఉన్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలు పెట్టాలని ఆదేశించినా ప్రభుత్వ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

టిఫిన్ సెంటర్ యజమాని నిజాయితీ

ఉయ్యూరు, జూన్ 20: దొరికిన బ్యాగును పోలీసులకు అప్పగించి, నిజాయితీని చాటుకున్న టిఫిన్ సెంటర్ యజమానిని అందరూ అభినందించారు. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం పామర్రు మండలం కనుమూరుకు చెందిన జి.మహేశ్ గురువారం ఉయ్యూరు వచ్చి వెళుతూ రెండు బంగారు ఉంగరాలు, విలువైన సామగ్రి ఉన్న బ్యాగును ఊరావారి కల్యాణ మండపం దగ్గర పోగొట్టుకున్నారు. ఆప్రాంతంలో టిఫిన్ సెంటర్ నడిపే చావలి శ్రీకాంత్‌కు బ్యాగు దొరికింది. దీంతో బ్యాగును తీసుకువెళ్లి పోలీసు స్టేషన్‌లో శ్రీకాంత్ అప్పగించాడు. పోలీసులు బ్యాగును యజమానికి అప్పగించారు. చావలి శ్రీకాంత్‌ను సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేశ్ కుమార్ తదితరులు అభినందించారు.



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రేవతి

ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తకు బంగారు పతకాలు

ఘంటసాల, జూన్ 20 : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ రేవతికి రెండు బంగారు పతకాలు వచ్చాయి. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా రేవతి పతకాలను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో అందరికంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం, అమ్మాయిల్లో అందరిక కంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం అందుకున్నట్టు రేవతి తెలిపారు.

కేశినేని చిన్ని శుభాకాంక్షలు..



విద్యాధరపురం, జూన్ 20 : రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడ భారతీనగర్‌లోని ఆయన నివాసంలో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా రవీంద్ర సమర్థవంతంగా పని చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అన్న నందమూరి తారకరామారావు కుమార్తెగా పురందేశ్వరి సమర్థత, సామర్థ్యం గల నాయకురాలిగా కేంద్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేస్తున్నారన్నారు.

రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన దమ్మాలపాటి శ్రీనివాస్‌ను హైకోర్టులోని ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్వకేట్ జనరల్‌గా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. జగన్ బాధితుల్లో దమ్మాలపాటి కూడా ఒకరని పేర్కొన్నారు.

గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని కేక్ కట్ చేసి ఫెడరేషన్ నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఐసీఎఫ్ స్టేట్ లీగల్ సెల్ ఛైర్మన్ చాట్ల రాజశేఖర్, టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇత్తడి చార్లెస్, నాయకులు సొంగా సంజయ్ వర్మ, పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన డీజీపీ ద్వారకా తిరుమలరావును గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుభాకాంక్షలు తెలియజేశారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో తిరుమలరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

విమానాశ్రయ విస్తరణ పనులపై కలెక్టర్ ఆరా..

గన్నవరం, జూన్ 20 : గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులపై వివిధ శాఖల అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమీక్షించారు. తొలుత ఎయిర్‌పోర్టు విస్తరణ వివరాలు తెలుసుకున్నారు. శాఖల వారీగా పనులపై ఆరా తీశారు. దావాజీగూడెం, అజ్జంపూడి గ్రామాల్లో పర్యటించారు. గన్నవరం-ఉంగుటూరు మధ్య ఏలూరు కాలువపై నిర్మించనున్న వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్, వెంచర్‌లను పరిశీలించారు. మొత్తం 896 ఎకరాలు సేకరించామని, అందులో 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. భూములు కోల్పోయిన వారికి కౌలు చెల్లించాల్సి ఉందని, డ్రెయినేజీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అద్దె చెల్లించాలని చెప్పారు. నష్ట పరిహారం పెంచాలని కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎమ్మెల్కె రెడ్డి, ఆర్డీవో పద్మావతి, తహసీల్దారు పవన్‌కుమార్, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్ఐ ఉదయ్‌కుమార్ వీఆర్వో శ్రీరామ్ కుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరులో విత్తనాలు వెదజల్లుతున్న కలెక్టర్ బాలాజీ

వ్యవసాయభూముల పరిశీలన..

- రైతులకు ప్రభుత్వ సాయం

పెడన రూరల్ : వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలక్టర్ డీకే బాలాజీ గూడూరులో వ్యవసాయ భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, సాగుకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి పోవటంతో విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్నామని రైతులు తెలిపారు. కూలీలద్వారా, యాంత్రికంగా వెదజల్లే విధానాన్ని పరిశీలించారు. స్వయంగా కలక్టర్ విత్తనాలు వెదజల్లారు. దారిలో ఉన్న నారుమళ్లను చేశారు. సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.పద్మావతి, ఏడీఏ మహిదర్, ఏవో జీవీ శ్రీనివాస్ తహసీల్దార్ శాంతి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడు దుర్మరణం



జి.కొండూరు, జూన్ 20 : ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీ కొట్టిన ఘటనలో స్కూటీపై వెళుతున్న యువకుడు దుర్మరణం చెందాడు. ప్రమాదం బుధవారం రాత్రి చెవుటూరులో 30.వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మైలవరానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ (21) తన ఇద్దరు స్నేహితులు షేక్ ఉస్మాన్, షేక్ సుభానితో కలిసి బుధవారం రాత్రి 9 గంటలకు జి.కొండూరు వైపు స్కూటీపై వస్తు ఎదురుగా చెవుటూరు ఇటుక బట్టీల్లోకి వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో నబీ తీవ్రంగా గాయపడగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో నబీని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి షేక్ గాలిషాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై షబ్బీర్ అహ్మద్ దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య



జగ్గయ్యపేట రూరల్, జూన్ 20 : మండలంలోని అన్నవరం గ్రామంలో రైతు కీతా బ్రహ్మయ్య (62) ఉరేసుకుని మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. గ్రామంలోని గిలక బావికి ఉన్న దిమ్మెకు మోకు కట్టి ఆ మోకును మెడకు ఉరిగా వేసుకుని బావిలోకి దూకటంతో మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..



గుడివాడ : స్థానిక మల్లాయిపాలెం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని నందివాడ మండలం టెలిఫోన్‌నగర్‌కు చెందిన కర్రె ప్రేమలీల(63) మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

బందరును మోడల్‌గా తీర్చిదిద్దుదాం

- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 20: మచిలీపట్నం నియోజకవర్గాన్ని కేంద్ర ప్రభుత్వ సాయంతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ కల్యాణ మండపంలో గురువారం రాత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. గజమాలలతో ఘనంగా సత్కరించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు లభించేందుకు పోర్టు అనుబంధ పరిశ్రమలను స్థాపిస్తామన్నారు. ఎంపీ బాలశౌరి సహకారంతో ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టులు నెలకొల్పుతామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గ ప్రజలు ఎన్నో అవస్థలకు గురయ్యారన్నారు. ప్రజలు తనకు 50వేలకు పైగా మెజారిటీ ఇచ్చి ఆదరించారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సంస్కరణలు చేపట్టారని, అనుకూలంగా వ్యవహరించే అధికారులు సహకరిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీకి వత్తాసు పలికి రాష్ట్రాన్ని అవినీతి మయంగా చేసిన అధికారులను ఉపేక్షించేది లేదన్నారు.

రవీంద్రకు శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

గన్నవరం: తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి కొల్లురవీంద్రకు గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు వల్లూరం హరిబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్య క్షుడు మండవ అన్వేష్ స్వాగతం పలికారు. కేక్ కట్ చేయిం చి, శుభాకాంక్షలు తెలిపారు.

పరిహారం ప్రకటిస్తేనే రహదారికి భూములిస్తాం

- అధికారులకు తేల్చి చెప్పిన వేలేరు రైతులు



భూసేకరణపై రైతుల అభ్యంతరాలను ఆర్డీవో, పీడీలకు అందజేస్తున్న వేములపల్లి శ్రీనివాసరావు, రైతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 20 : జాతీయరహదారి 216హెచ్(పోర్టురోడ్డు) కానుమోలు శివారు నుంచి వేలేరు మీదుగా ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలం సీతారాంపురం వరకు నిర్మించే రహదారి భూసేకరణ నిమిత్తం విధి, విధానాలతో కూడిన కార్యాచరణ ప్రకటిస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు. వేలేరులో గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, ఎన్‌హెచ్216హెచ్ మచిలీపట్నం, ప్రాజెక్ట్ డైరెక్టర్, సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం భూసేకరణ సదస్సు నిర్వహించారు. రైతులకు ఎటువంటి సమాచారం లేకుండానే గుగుల్ మ్యాప్ ఆధారంగా సాగు భూముల్లో సర్వే చేసి కాంక్రీట్ పిల్లర్లు వేయడం పట్ల అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా చూపడంపై ప్రశ్నిస్తూ సదస్సును అడ్డుకున్నారు. మండల సర్వేయర్ ఫణికుమార్ రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆర్డీవో ఎదుట ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మరల ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని ఆర్డీవో, పీడీ హామీపై రైతులు శాంతించడంతో సదస్సు నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు, కట్టడాలకు, బోర్లకు, డ్రిప్, పైప్‌లైన్లకు, టేకు, వేప, తదితర వృక్షాలకు పోలవరం కుడికాలువ నిర్మాణానికి ఏ విధంగా భూసేకరణ నష్టపరిహారం ఇచ్చారో అదే విధంగా అమలు చేయాలని, ఉన్నతస్థాయి కమిటీతో సమావేశం జరిగేలా చూడాలని కోరుతూ రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాసరావు అధికారులకు అందజేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని, ఈసారి పనులను అడ్డుకుంటామని రైతులు, ప్రజలు హెచ్చరించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఉన్నత స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆర్డీవో పద్మావతి, పీడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్‌హెచ్ ఏఈ వెంకట్, సర్వే(డీఐ) నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.



హుండీలలో కానుకల లెక్కిస్తున్న సిబ్బంది

16 రోజులకుగాను కనకదుర్గమ్మకు..
రూ.3.23 కోట్ల కానుకలు

వన్‌టౌన్, జూన్ 20 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. 16 రోజులకు గాను రూ.3,23,75, 523లు సమకూరింది. సగటున రోజుకు రూ.20,23,470లు కానుకల రూపంలో రాగా రికార్డు స్థాయిలో రోజువారీ హుండీ ఆదాయం పెరిగినట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. బంగారం 694 గ్రాములు, వెండి 6కిలోల 264 గ్రాములు వచ్చాయి. 516 యూఎస్ డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 1000 కొరియా ఓన్‌లు, 40 ఇంగ్లండ్ పౌండ్లు, 100 ఓమన్ బైస్సాలు, 17 కెనడా డాలర్లు, 25 యూఏఈ దీర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 2 సింగపూర్ డాలర్లు సమకూరాయి. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ.59,380లు ఆదాయం వచ్చింది. లెక్కింపు పర్యవేక్షణలో ఈవో రామారావు, దేవదాయశాఖ అధికారులు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీ వ్యవస్థపై ఈవో సమీక్ష

ఐటీ వ్యవస్థపై గురువారం ఈవో రామారావు తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ ప్రతినిధి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రతి సేవాకార్యక్రమాన్ని భక్తులు వీక్షించే విధంగా అమ్మవారి సేవలను భక్తులకు మరింత చేరువగా తీసుకునివెళ్లేందుకు అవగాహన కల్పించే విధంగా డిజిటల్ మార్కెటింగ్ చర్యలు తీసుకోవాలని ఈవో కోరారు. ఆలస్యం లేకుండా సంబంధిత సేవలు భక్తులకు అందేలా చూడాలని సూచనలు చేశారు.

ఆన్‌లైన్‌లో టికెట్‌లు బుక్ చేసుకుని సులభతరంగా స్లాట్ మేరకు అమ్మవారి దర్శనం చేసుకోవచ్చునని దేవస్థానం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపింది. స్వయంగా పూజా కార్యక్రమంలో పాల్గొనలేని భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్‌లు కొనుగోలు చేసి ఇంటివద్దనే ఉండి పరోక్ష సేవల్లో పాల్గొనవచ్చునని తెలిపారు.



దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చన

మల్లేశ్వరాలయం ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞానబిక్ష కోసం, మేథోసంపత్తి కోసం, సుఖం, శాంతి కలగడం కోసం సంకల్పిస్తూ దక్షిణామూర్తికి వివిధ ఉపచారాలను నిర్వహించారు. మంత్రపుష్పం, హారతులు సమర్పించారు.

ధర్మపథం వేదికపై..

దేవస్థానంలోని ధర్మపదం వేదికపై గురువారం నర్తన నటరాజ నాట్యాలయం యశశ్రీ ఆధ్వర్యంలో కళాకారులు పలు కీర్తనలకు నాట్యప్రదర్శన చేసి భక్తుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు.



ఎంపీ పార్థసారథికి, మంత్రి నిమ్మలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో ప్రముఖులు..



దుర్గమ్మ సేవలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం ఇద్దరు రాష్ట్ర మంత్రులు, ఒక ఎంపీ విచ్చేశారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో వారికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రం తదితరాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబసభ్యులు, ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, ఎంపవర్ మెంట్, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులు, ఎంపీ బీకే పార్థసారధిలు ఉన్నారు.



పవన్‌కల్యాణ్‌కు శ్రీవారి విగ్రహాన్ని అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

పవన్‌కల్యాణ్‌కు కలెక్టర్ దంపతుల శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్ 20 : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతిక మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు వెంకటేశ్వరస్వామి దారు విగ్రహాన్ని, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఢిల్లీరావుతో పాటు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమీషనర్‌గా పని చేస్తున్న ఆయన సతీమణి పి.ప్రశాంతిలు పవన్‌కల్యాణ్‌కు హృదయపూర్వక అభినందనలు అందజేశారు



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రేవతి

ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తకు బంగారు పతకాలు

ఘంటసాల, జూన్ 20 : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ రేవతికి రెండు బంగారు పతకాలు వచ్చాయి. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా రేవతి పతకాలను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో అందరి కంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం, అమ్మాయిల్లో అందరిక కంటే అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు బంగారు పతాకం అందుకున్నట్టు రేవతి తెలిపారు.

ఏపీ-పీజీ సెట్‌లో గుడ్లవల్లేరు విద్యార్థులకు ర్యాంకులు

గుడ్లవల్లేరు, జూన్ 20 : గుడ్లవల్లేరు వి.వి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ బి.ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ పూర్తి చేసిన 40 మంది విద్యార్థులు ఏపీ-పీజీ సెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. 100 లోపు ఐదుగురు, 1000 లోపు 18 మంది, 2000 లోపు 17 మంది ర్యాంక్‌లు సాధించారన్నారు. కె.సాంబయ్యకు 43వ ర్యాంకు, సీహెచ్ సువర్ణకు 57వ ర్యాంక్, ఎం.నరసింహారావుకు 68వ ర్యాంక్, ఎం.కుసుమ సిరి 88, సీహెచ్ రాంపండు 99వ ర్యాంక్‌లు సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



పుట్టినరోజు వేడుకల్లో మంత్రి రవీంద్ర, రామకృష్ణలను సత్కరిస్తున్న జనసైనికులు, గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో, గోపీ చంద్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం

మోడల్ నియోజకవర్గంగా బందరు

● బందరు పోర్టు పూర్తి చేసి, అనుబంధ పరిశ్రమలు తెస్తాం

● జన్మదిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన

మచిలీపట్నం టౌన్, జూన్ 20 : మచిలీపట్నం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ కల్యాణ మండపంలో గురువారం రాత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి గజమాలలతో ఘనంగా సత్కరించారు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు లభించేందుకు పోర్టు అనుబంధ పరిశ్రమలను స్థాపిస్తామన్నారు. ఎంపీ బాలశౌరి సహకారంతో మచిలీపట్నంలో ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టులు నెలకొల్పుతామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు. . మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ప్రజలు అఖండ విజయాన్ని ఇచ్చారని, ప్రజలు ఆశించిన విధంగా పరిపాలన సాగుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు కుంచే నాని, గోపు సత్యనారాయణ, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకే శేషగిరిరావు, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఎంపీ కేశినేని చిన్ని శుభాకాంక్షలు

విద్యాధరపురం, జూన్ 20 : రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడ భారతీనగర్‌లోని ఆయన నివాసంలో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా రవీంద్ర సమర్థవంతంగా పని చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

వైసీపీ పాలనలో బాధిత వర్గాలకు ప్రభుత్వం అండగా వుండాలని కోరుకున్నా



తిరుమలలో శ్రీవారి సేవలో రవీంద్ర

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నష్టపోయిన అన్ని వర్గాలకూ ప్రస్తుత ప్రభుత్వం అండగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పవన్ కల్యాణ్, మోదీ సహకారంతో చక్కటి ప్రభుత్వం ఏర్పాటు కావాలని తాను ఓ యాగం చేసినట్టు తెలిపారు. యాగం ముగిసిన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టాలని, అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

జనసేన రామకృష్ణ ఆధ్వర్యంలో..

జనసేన కార్యాలయంలో గురువారం రాత్రి కొల్లు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణను జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, పేద ప్రజల కష్టాలను అర్థం చేసుకునే కొల్లు రవీంద్ర మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బండి రామకృష్ణ ఆకాంక్షించారు. గడ్డం రాజు, వంపుగడల చౌదరి, కర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బందరు రూరల్ మండలంలో..

మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలు నగరంతో పాటు బందరు రూరల్ మండలంలో టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా జరిపారు. కేకు కటింగ్ చేసి, అన్నదానం, వస్త్రదానం జరిపారు. 15వ డివిజన్‌లో రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు డాక్టర్ హసీంబేగ్ ఆధ్వర్యంలో చీరెల పంపిణీ చేశారు. సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్ పాషా, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సమీర్, మాదిరెడ్డి శ్రీను పాల్గొన్నారు. చిన్నాపురంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి, అన్నదానం జరిపారు. సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ సర్పంచ్ పరంజ్యోతి, నిరంజన్, కేశన రమేష్‌బాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు. కానూరు గ్రామ సచివాలయం వద్ద టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. దివి మహేష్, రాము, మోకా రాజు, మోపిదేవి కృష్ణ, వంకా కాశీ, గోపు మహేష్, ఈమన చంద్రరావు, బొమ్మిడి స్వామి, చిటికెన శివనాగబాబు, ఎస్. భాస్కర్, కొండా, లోకేష్, ఇమానుయేల్, బెజవాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కోనేరుసెంటర్‌లో కొల్లు రవీంద్ర జన్మదినోత్సవం సందర్భంగా కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం జరిపారు. న్యాయవాదులు లంకే వెంకటేశ్వర రావు, సత్యనారాయణ, పోతురాజు ఆధ్వర్యంలో సుకర్లబాద్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కార్మికులు, ప్రయాణికులు ఆర్టీసీకి రెండు కళ్లు

● రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బస్సుస్టేషన్, జూన్ 20 : ఆర్టీసీకి కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్ల అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రత్యేక బృందం తో అధ్యయనం చేయించి వీలైనంత త్వరలో అమలు చేస్తామన్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. విద్యుత్ బస్సులను ఎక్కువగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ ఆస్తులను దుర్వినియోగం చేసినా, అన్యాక్రాంతం చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో ఆర్టీసీ అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికులను మంత్రి పలకరించి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిపార్చర్ బ్లాక్, సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్‌లు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. దూర ప్రాంత ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హోటల్ యాజమానులకు సూచిం చారు. మంత్రిని అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, సభ్యులు సత్కరించారు. డీజీపీగా పదోన్నతి పొందిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఆయన అభినందనలు తెలిపారు. జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం, పీఎంబీఎస్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీఎన్‌బీఎస్‌లో కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

మోపిదేవి/అవనిగడ్డ, జూన్ 20 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు కె.రఘురామ కృష్ణరాజు గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందజేశారు.

నూతన ప్రభుత్వంలో సుపరిపాలన రావాలి

భాషా.. ద్వేష పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం సఫలమయిందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అన్నారు. గురువారం అవనిగడ్డకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రఘురామ మీడియాతో మాట్లాడుతూ, తెలుగుభాష పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణ కోసం గత ప్రభుత్వంపై తాను చేపట్టిన పోరాటం ఫలించిందని, ప్రజలు ఓటు రూపంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అద్భుతమైన విజయం అందించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం సుపరిపాలన అందించేలా భగవంతుని ఆశీస్సులు లభించాలని కోరారు. సమావేశంలో మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో పనులు త్వరగా పూర్తి చేయాలి : రాము



గుడివాడ, జూన్ 20 : టిడ్కో కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో టిడ్కో కాలనీలో అభివృద్ధి పనులు, లబ్ధిదారులకు అప్పగించాల్సిన ప్లాట్‌ల వివరాలపై టిడ్కో, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్‌లో నేటి వరకు జరిగిన పనులు, పెండింగ్ పనులపై ఎమ్మెల్యేకు ఎస్.ఇ బి.చిన్నోడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడ్కో కాలనీలో నేటికి 6900 మందికి ప్లాట్‌లను అప్పగించారని, మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే అప్పగిస్తామన్నారు. ఈ నెల 24వ తేదీ జరగనున్న సమావేశంలో కాలనీలో అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్‌లు వివరాలతో రావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడ్కో, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరం తడవాలి..

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరం తడవాలని, ఒక్క ఎకరం కూడా మునగకూడదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం ప్రజావేదికలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు యిచ్చిన హామీ మేరకు సాగునీరు అందించేలా కృషి చేస్తానన్నారు. నీటి పన్ను వసూళ్ల నివేదిక యివ్వాలన్నారు. నియోజకవర్గంలో పంటకాలువల్లో 10చోట్ల పనులు చేయాల్సి ఉందని ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, 26చోట్ల పనులు చేయాల్సి ఉందని డ్రెయినేజీ డీఈ గణపతిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టిసీమలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, నీటిని రైతులందరికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

పరిహారం వివరాలు ప్రకటిస్తేనే రహదారికి భూములిస్తాం



రైతుల అభ్యంతరాలను అందజేస్తున్న వేములపల్లి శ్రీనివాసరావు, రైతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 20 : జాతీయరహదారి 216 హెచ్ (పోర్టు రోడ్డు) కానుమోలు శివారు నుంచి వేలేరు మీదుగా ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలం సీతారాంపురం వరకు నిర్మించే రహదారి భూసేకరణ నిమిత్తం విధి, విధానాలతో కూడిన కార్యాచరణ ప్రకటిస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు. వేలేరులో గుడివాడ ఆర్డీవో పి. పద్మావతి, ఎన్‌హెచ్216హెచ్ మచిలీపట్నం, ప్రాజెక్ట్ డైరెక్టర్, సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం భూసేకరణ సదస్సు నిర్వహించారు. రైతులకు ఎటువంటి సమాచారం లేకుండానే గుగుల్ మ్యాప్ ఆధారంగా సాగు భూముల్లో సర్వే చేసి కాంక్రీట్ పిల్లర్లు వేయడం పట్ల అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా చూపడంపై ప్రశ్నిస్తూ సదస్సును అడ్డుకున్నారు. సర్వేయర్ ఫణికుమార్ రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆర్డీవో ఎదుట ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని ఆర్డీవో, పీడీ హామీపై రైతులు శాంతించడంతో సదస్సు నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు, కట్టడాలకు, బోర్లకు, డ్రిప్, పైప్‌లైన్లకు, టేకు, వేప, తదితర వృక్షాలకు పోలవరం కుడికాలువ నిర్మాణానికి ఏ విధంగా భూసేకరణ నష్టపరిహారం ఇచ్చారో అదే విధంగా అమలు చేయాలని, ఉన్నతస్థాయి కమిటీతో సమావేశం జరిగేలా చూడాలని కోరుతూ రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాస రావు అధికారులకు అందజేశారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లి త్వరలోనే ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆర్డీవో పద్మావతి. పీడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్‌హెచ్ ఏఈ వెంకట్, సర్వే(డీఐ) నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

విమానాశ్రయ విస్తరణ పనులపై కలెక్టర్ ఆరా..

గన్నవరం, జూన్ 20 : గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులపై వివిధ శాఖల అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సమీక్షించారు. తొలుత ఎయిర్‌పోర్టు విస్తరణ వివరాలు తెలుసుకున్నారు. శాఖల వారీగా పనులపై ఆరా తీశారు. దావాజీగూడెం, అజ్జంపూడి గ్రామాల్లో పర్యటించారు. గన్నవరం-ఉంగుటూరు మధ్య ఏలూరు కాలువపై నిర్మించనున్న వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజ్, వెంచర్‌లను పరిశీలించారు. మొత్తం 896 ఎకరాలు సేకరించామని, అందులో 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. భూములు కోల్పోయిన వారికి కౌలు చెల్లించాల్సి ఉందని, డ్రెయినేజీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అద్దె చెల్లించాలని చెప్పారు. నష్ట పరిహారం పెంచాలని కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.ఎల్.కె రెడ్డి, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ పవన్‌కుమార్, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్ఐ ఉదయ్‌కుమార్, వీఆర్వో శ్రీరామ్ కుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరులో విత్తనాలు వెదజల్లుతున్న కలెక్టర్ బాలాజీ

వ్యవసాయ భూముల పరిశీలన..

▸▸ రైతులకు ప్రభుత్వ సాయం

పెడన రూరల్ : వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలెక్టర్ డీకే బాలాజీ గూడూరులో వ్యవసాయ భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, సాగుకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి పోవటంతో విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్నామని రైతులు తెలిపారు. కూలీలు, యాంత్రికంగా వెదజల్లే విధానాన్ని పరిశీలించారు. స్వయంగా కలెక్టర్ విత్తనాలు వెదజల్లారు. దారిలో ఉన్న నారు మళ్లను పరిశీలించారు. సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి, ఏడీఏ మహీధర్, ఏవో జీవీ శ్రీనివాస్ తహసీల్దార్ శాంతి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



జి.కొండూరు, జూన్ 20 : ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీ కొట్టిన ఘటనలో స్కూటీపై వెళుతున్న యువకుడు దుర్మరణం చెందాడు. ప్రమాదం బుధవారం రాత్రి చెవుటూరులో 30.వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మైలవరానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ (21) తన ఇద్దరు స్నేహితులు షేక్ ఉస్మాన్, షేక్ సుభానిలతో కలిసి బుధవారం రాత్రి 9 గంటలకు జి.కొండూరు వైపు స్కూటీపై వస్తు ఎదురుగా చెవుటూరు ఇటుక బట్టీల్లోకి వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో నబీ తీవ్రంగా గాయపడగా, మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో నబీని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి షేక్ గాలిషాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై షబ్బీర్ అహ్మద్ దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య



జగ్గయ్యపేట రూరల్, జూన్ 20 : మండలంలోని అన్నవరం గ్రామంలో రైతు కీతా బ్రహ్మయ్య (62) ఉరేసుకుని మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. గ్రామంలోని గిలక బావికి ఉన్న దిమ్మెకు మోకు కట్టి ఆ మోకును మెడకు ఉరిగా వేసుకుని బావిలోకి దూకటంతో మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..



గుడివాడ : స్థానిక మల్లాయిపాలెం రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని నందివాడ మండలం టెలిఫోన్‌నగర్‌కు చెందిన కర్రె ప్రేమలీల(63) మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పలువురికి కేశినేని శుభాకాంక్షలు



విద్యాధరపురం, జూన్ 20 : కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అన్న నందమూరి తారకరామారావు కుమార్తెగా పురందేశ్వరి సమర్థత, సామర్థ్యం గల నాయకురాలిగా కేంద్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేస్తున్నారన్నారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన దమ్మాలపాటి శ్రీనివాస్‌ను హైకోర్టులోని ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని కేక్ కట్ చేసి ఫెడరేషన్ నాయకులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన డీజీపీ ద్వారకా తిరుమలరావును గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 138, 147, 158
చికెన్ విత్ స్కిన్ 268
చికెన్ స్కిన్‌లెస్ 278
నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.05

కృష్ణా
● పెనమలూరు ● గన్నవరం

ఆంధ్రజ్యోతి 7
శుక్రవారం
21 జూన్ 2024
www.andhrajyothy.com

రెవెన్యూ ఉద్యోగుల సేవలు నిరుపమానం

● కలెక్టర్ డీకే బాలాజీ

కంకిపాడు, జూన్ 20: ప్రజలతో మమేకమై 24 గంటలూ విధుల్లో రెవెన్యూ సిబ్బంది ఉంటారని, వారి సేవలు నిరుపమానమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన టి.శివనాగేశ్వరరావు, ఆర్.రమాదేవి, ఏసుపాదం, పి.రామకృష్ణను సత్కరించారు. ఉయ్యూరు డివిజన్ అధికారి డి.రాజు, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీవో అనూష, రెవెన్యూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, ఏడుకొండలు, మద్దూరు రఘురామప్రసాద్ పాల్గొన్నారు.

మురుగు సమస్య రెండురోజుల్లో పరిష్కరించండి

పునాదిపాడు పరిధిలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన మురుగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని సంస్థ సిబ్బందిని కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. కళాశాల మురుగు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వదిలేస్తున్నారని కలెక్టర్‌కు రైతులు వివరించారు. దీంతో కళాశాల సిబ్బందిని పిలిపించి తక్షణమే వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

పెనమలూరు: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తున్న రెవెన్యూ సిబ్బంది సేవలు ఎనలేనివని ఉయ్యూరు ఆర్డీవో రాజు అన్నారు. పెనమలూరు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు నారగాని వెంకటేశ్వరరావు, ఎంఎస్ రామానుజంను ఆయన సన్మానించారు. తహసీల్దారు పీఎస్డీ ప్రసాద్, ఎంపీడీవో కుమార్‌బాబు, డీటీలు అనిల్‌కుమార్, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.



విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

● **ఉయ్యూరు:** తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్లు గాంధీ, నాగేశ్వరరావు, వీఆర్వో రామలింగేశ్వరరావు, టైపిస్టు భాస్కరరావు, వాచ్‌మెన్ జయరాజును శాలువాలతో తహసీల్దార్ ఎన్.గురుమూర్తిరెడ్డి సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ, వీఆర్వోలు, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని ప్రసాద్, ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మండవ జయదేవ్ పాల్గొన్నారు.

● **హనుమాన్‌జంక్షన్:** ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు విశ్రాంత రెవెన్యూ ఉగ్యోగులను తహసీల్దార్ జేవీ సుబ్బారావు సత్కరించి అభినందించారు. డీటీ శ్రీలత, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



పెనమలూరులో రెవెన్యూ దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజు



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఉయ్యూరు తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి




ఉంగుటూరులో తహసీల్దార్ జేవీ సుబ్బారావు

11 మంది గ్రేడ్-5 కార్యదర్శుల నియామకం

హనుమాన్‌జంక్షన్, జూన్ 20: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి సూచించారు. గురువారం మండలంలో సచివాలయ కార్యదర్శులుగా పనిచేస్తున్న 11 మందిని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా ప్రభుత్వం నియమించింది. వారికి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు. గ్రేడ్-5 కార్యదర్శులతో ఎంపీడీవో సమా వేశం నిర్వహించి విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, కార్యాలయం ఏవో శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ అహ్మద్ పాల్గొన్నారు. ఎంపీడీవోను గ్రేడ్-5 కార్యదర్శులు సత్క రించారు. మండల పరిషత్ సమావేశ హాలులో పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-5 కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో రత్నకుమారి సమావేశం నిర్వహించి, కొత్త ప్రభుత్వంలో ప్రతి పథకం అర్హులకందేలా చూడాలని ఆదేశించారు.









ప్రభుత్వ నిబంధనల మేరకే
శానిటరీ సిబ్బందికి జీతాల చెల్లింపులు

● పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు

పెనమలూరు, జూన్ 20: గ్రామ పంచాయతీలో నిబంధనల మేరకే పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్నామని పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు పేర్కొన్నారు. జీతాల చెల్లింపుల్లో పంచాయతీలో సర్పంచ్ భాస్కరరావు, ఈవో సుబ్బారావు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ 15వవార్డు సభ్యుడు చిగురుపాటి శ్రీనివాసరావు ఈనెల 18న కలెక్టరుకు ఫిర్యాదు ఇచ్చారని పత్రికల్లో రావడంపై భాస్కరరావు స్పందించారు. గతేడాది కలెక్టరు ఉత్తర్వులు, డీపీవో సూచనల మేరకు గ్రామంలో 58మంది పారిశుధ్య సిబ్బందికి ఒక్కొక్కరికి. రూ.375 చొప్పున చెల్లించామని తెలిపారు. గత మార్చిలో పంచాయతీ తీర్మానం మేరకు ఒక్కొక్కరికి రూ.349 నిర్ణయించి పారదర్శకంగా చెల్లింపులు చేశామని తెలిపారు. పంచాయతీలో 58మందికి అదనంగా మరో ఐదుగురిని నియమించి వారితో పనులు చేయించి తన సొంత డబ్బు వారికి జీతాలుగా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. మేజరు పంచాయతీ పెనమలూరులో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలను ఖండిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎలక్ట్రీషియన్
అనుమానాస్పద మృతి

హనుమాన్‌జంక్షన్, జూన్ 20: జంక్షన్ పీఎస్ పరిధిలోని బొమ్ములూరు దీపక్ నెక్సజెన్ ఫ్యాక్టరీ వెనుక ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన యలకల గౌరినాయుడు(50) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల18వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు విచారణ జరపగా ఫ్యాక్టరీ వెనుక భాగంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని ఎస్సై జనార్దన్ తెలిపారు. గురువారం మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు తెలిపారు.





చిరస్మరణీయుడు రామోజీరావు



జంక్షన్‌లో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



రంగన్నగూడెంలో నివాళులర్పిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 20: ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడు రామోజీరావు చిరస్మరణీయుడని, ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటని టీడీపీ హనుమాన్ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రామోజీ చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, హనుమంతు నాగేశ్వరరావు, చెరుకూరి రాము, ఆళ్ల సురేశ్, పొట్లూరి ఫణి, వల్లభనేని నాగమణి, మొవ్వా వెంకటేశ్వరరావు, యలమంచిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పత్రికా రంగానికి తీరని లోటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పాత్రికేయ రంగంలో విప్లవాత్మకమార్పులు తీసుకువచ్చిన రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో రామోజీరావు చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో కలిసి ఆయన గురువారం నివాళులర్పించారు. గత ప్రభుత్వ అరాచకపాలనను, అప్రజాస్వామిక విధానాలను ఎండగడుతూ సిద్ధాంతాల కోసం చివరిశ్వాస వరకూ నిలబడిన వ్యక్తి రామోజీరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కసుకుర్తి రంగామణి, పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా శ్రీనివాసరావు, తుమ్మల దశరథరామయ్య, మందపాటి రాంబాబు, వేణుబాబు, కనకవల్లి శేషగిరిరావు, అర్జునరావు పాల్గొన్నారు.





మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

గన్నవరం, జూన్ 20: గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వీకేఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. 480 మంది యువతీయువకులు రాగా రాష్ట్రంలోని పేరొందిన 15 సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపారు. 125 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. నవీన్ కుమార్ పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.05

చల్లపల్లిలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



చల్లపల్లి : ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో గురువారం జరిగాయి. టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కేక్ కట్‌చేశారు. భువనేశ్వరి సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియా డారు. మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేతలు నిడమానూరి దిలీప్‌కుమార్, నాదెళ్ల వెంకట నరసయ్య, మేకా పెద్దబ్బాయ్, షేక్ నబీషెహోరి, గుత్తికొండ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ మదుసూధనరావులు పాల్గొన్నారు.



రెవెన్యూ డే వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



గుడ్లవల్లేరులో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం

సేవల్లో రెవెన్యూదే అగ్రస్థానం

● మంత్రి కొల్లు రవీంద్ర



మొవ్వలో విశ్రాంత రెవెన్యూ అధికారులను సత్కరిస్తున్న తహసీల్దార్ వెంకట లక్ష్మి

మచిలీపట్నం టౌన్, జూన్ 20 : సేవల్లో రెవెన్యూ శాఖదే అగ్రస్థానమని ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా కలెక్టరేట్ సమావేశపు హాలులో గురువారం రాత్రి విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. డీఆర్వో కె. చంద్రశేఖర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** పాలనలో రెవెన్యూ వ్యవస్థ ఎంతో కీలకమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలువురికి సన్మా నం చేశారు. బొడ్డు వేణుగోపాలరావు, హన్ను, యక్కల శ్యామలయ్య, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు. **గుడివాడ :** ఎన్‌జీవోస్ హోంలో రెవెన్యూ డేలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగస్తులను సత్కరించారు. తహసీల్దార్ ఏ.వి రామాంజనేయులు, డీటీ లోకరాజు, ఆర్.ఐ నాగబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గూడపాటి లక్ష్మణరావు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** తహసీల్దార్ సునీల్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గని ఘనంగా సత్కరించారు. విశ్రాంత వీఆర్వోలు సూరిబాబు, విశ్రాంత డీటీ గౌతమ్, అంగలూరు వీఆర్‌ఏ నాంచారయ్య , పెంజంద్ర వీఆర్‌ఏ షేక్ మస్తాన్‌లను సత్కరించారు. రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ షకిలా బేగం ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** తహసీల్దార్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన విశ్రాంత రెవెన్యూ సిబ్బంది గోవర్ధన కుటుంబరావు, శ్రీరామసుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఆర్ఐ శేఖర్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. **కూచిపూడి :** మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత వీఆర్వోలు భానుమూర్తి, గోవాడ రాంబాబు, కర్రా శ్యామ్‌లను ఘనం గా సత్కరించారు. తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ మండవ రామ్మోహనరావు, ఆర్ఐ విజయలక్ష్మి, లింగమనేని రామలింగేశ్వరరావు, మండవ శ్రీకృష్ణ, తాతినేని పూర్ణచంద్రరావు, శీలం బాబురావు, డిటి సిహెచ్.గోపాలరావు, వీఆర్వోలు పాల్గొన్నారు. **చల్లపల్లి :** తహసీల్దార్ బి.సుమతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ డేలో ఉత్తమ సేవలందిస్తున్న సర్వే టీడీ శారద, సర్వేయర్ నారాయణ, వీఆర్వోలు కోట కిరణ్, గొల్లపూడి రాజేంద్రలను సత్కరించారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, రైతు నాయకులు నిడమానూరి దిలీప్‌కుమార్, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు, నేతలు షేక్ నబీషెహోరి, బొందలపాటి వీరబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** రెవెన్యూ శాఖ ఖ్యాతిని ఇనుమడించేలా ప్రజలకు సేవ చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్, విశ్రాంత జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు కోరారు. తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ డే నిర్వహించారు. **నాగాయలంక :** తహసీల్దార్ సిలార్ బాషా ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరిగింది. మెండు లక్ష్మణరావు, మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, పుట్టి స్వరూప రాణి, బండ్రెడ్డి హరితోపాటు రైతులు, ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు. వీఆర్వో టి.జె.ఎస్.సాయిబాబు పర్యవేక్షించారు. **మోపిదేవి :** విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, తహసీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ సునీల్, వీఆర్వోలు మూర్తి, బొడ్డు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. **తోట్లవల్లూరు :** తహసీల్దార్ కుసుమకుమారి ఆధ్వర్యంలో రిటైర్డ్ వీఆర్వో జగద్రక్షరావుని సత్కరించారు. ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ ధనలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పోరంకి, విష్ణుపురం కాలనీ, విఘ్నేష్ హైట్స్, ఫ్లాటు నెం.207 కాపురస్తులు అయిన మాగంటి కృష్ణ సందీప్ గారి భార్య నెల్లూరు మౌనిష గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలాస్తి కృష్ణాజిల్లా, నందివాడ మండలం, పోలుకొండ గ్రామ కాపురస్తులైన లేటు అదుసుమల్లి వెంకట్రామయ్య గారి భార్య బేబి సరోజిని గారు ది. 20-09-1989న మొవ్వా ధనలక్ష్మి గారి వలన క్రయం పొంది మండవల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1368/1989గా రిజిష్టరు. కాబడి సర్వసంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో ఉన్న భూమిని ది.12-06-2012న మండవల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో వీలునామా దస్తావేజు నెం. 10/2012గా రిజిష్టరు చేసిన రీత్యా సదరు వీలునామా ద్వారా దిగువ షెడ్యూలు దాఖలాస్తి బేబీ సరోజిని గారి రెండవ కుమార్తె అయిన నిమ్మగడ్డ లక్ష్మీ కుమారిగారికి సంక్రమించి సర్వసంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవించుచూ సదరు ఆస్తిని అమ్మజూపగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు అంగీకరించి నిమ్మగడ్డ లక్ష్మీకుమారి గారితో విక్రయ అగ్రిమెంట్ చేసుకొనియున్నారు.

కావున ఈ క్రయ వ్యవహారములో షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ, ఏవిధమైన ఆక్షేపణలు, క్లెయిమ్లు, కోర్టు డిక్రీలు, హక్కులు, బాధ్యతలు, జాయింటు భాగలబ్ధి తగాయిదాలు, పొసేజ్ రైట్స్ మొదలగునవి ఉన్నచో ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలో నాకు గాని, నా క్లయింటుకు గాని రిజిష్టరు పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియజేయగలరు. గడువు తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

క్రయాస్తి షెడ్యూలు : ఏలూరు జిల్లా, మండవల్లి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా నందివాడ మండలం, పోలుకొండ గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పోలుకొండ గ్రామములోని పోలుకొండ గ్రామ రీ సర్వే నెం. 696 దాఖలా 1.10 సెంట్లు చేపల చెరువుగా గల భూమికి హద్దులు. **తూర్పు :** పెదవలి రాజుగారి భూమి, **దక్షిణం :** మాగంటి రాంబాబు గారి భూమి, **పడమర:** పర్వతనేని వెంకట రామారావు వగైరాల భూమి, **ఉత్తరం :** కొలిమి రోడ్డు.

ఈ నాలుగు హద్దుల మధ్య య.1.10ట్లు చేపల చెరువుగా గల భూమి.

కె. వకుళా దేవి, పి. దుర్గా మహేంద్ర
న్యాయవాదులు
H.No.5-20, వణుకూరు, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా - 521 151
సెల్ నెం. : 93929 22017

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



పామర్రు : పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో సేవలందించాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కుమార్‌రాజా మాట్లాడుతూ, ప్రజలు ఆశించిన రీతిలో సేవలందించి ప్రజామన్నన పొందాలన్నారు. తొలుత పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ దినోత్సవంలో పాల్గొని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల్ని సన్మానించారు. గొట్టిపాటి లక్ష్మీదాసు, వల్లూరిపల్లి గణేష్, మండపాక శంకర్‌బాబు, తాడిశెట్టి నరేష్ కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, సందీప్, పంచాయతీ సభ్యులు మంతెన రామాంజనేయులు, తహసీల్దార్ శ్రీపల్లవి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులు నిబద్ధతతో పని చేయాలి

అవనిగడ్డ రూరల్ : పోలీసు అధికారులు నిబద్ధతతో పని చేయాలని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో అవనిగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సై లతో సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీతోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మండలి వెంకట్రామ్ జన్మదిన వేడుకలు

అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం అవనిగడ్డలోని గాంధీక్షేత్రం లో బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్విన్ కుమార్, మండలి వెంకట్రామ్ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహూకరించారు. పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు వెంకట్రామ్‌ను ఘనంగా సత్కరించారు. **కోడూరు :** టీడీపీ కార్యాలయంలో మండలి వెంకట్రామ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు , టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఘంటసాల :** శ్రీకాకుళం గ్రామంలో ఎమ్మెల్యే కుమారుడు మండలి వెంకట్రామ్ పుట్టిన రోజు వేడుకలను ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ చిన్న, జనసైనికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొండాలమ్మ సేవలో ఎమ్మెల్యే కామినేని

గుడ్లవల్లేరు : కొండాలమ్మ అమ్మవారిని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు గురువారం దర్శించుకొన్నారు. కామినేని శ్రీనివాస్‌ను, కమ్మిలి విఠల్‌రావులను శేషవస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ అందజేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలందించాలి

గుడివాడ రూరల్ : రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందించటానికి వ్యవసాయ శాఖాధికారులు కృషి చేయాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి.వై.ఎస్.మనోహర్ అన్నారు. ఏడీఏ కార్యాలయంలో ఖరీఫ్‌లో విత్తనాల పంపిణీ, మట్టి నమూనాల సేకరణ, పీఎం కిసాన్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. సేంద్రియ ఎరువులను నారుమడులు, పొలాల్లో వాడాలన్నారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఏవోలు బోలెం అనంతలక్ష్మి, త్రినాథ ఆంజనేయరావు, శాంత, సురేష్ బాబు పాల్గొన్నారు.

11 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు పదోన్నతి

పెడన రూరల్ : మండలంలోని సచివాలయాల్లో పని చేస్తున్న 11 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులు (డీడీవో)లుగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు. ఆర్.మహేష్ నాయక్, పి.రేవతి, వజీర్, వై.మహేశ్వరరావు, జి సాయి హవీల, బి వాసు, వి.కోట షణ్ముఖరావు,, ఎ.రాఘవయ్య, జె.శాంతకుమారి,ఆర్‌వీఎస్ నాగరాజు, ఎ.శిరీష పదోన్నతిపై బదిలీ అయ్యారు.

సెల్ టవర్ నిలుపుదల చేయాలంటూ ఆందోళన

మోపిదేవి : వెంకటాపురం గ్రామ శివారులోని ఎస్టీ కాలనీ సమీపంలో సెల్ టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేయాలంటూ గ్రామస్థులు గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఎంపీడీవో రామలింగేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.శ్రీవిద్యలకు వినతిపత్రం అందజేశారు.

వైసీపీ నాయకులపై వలంటీర్ల ఫిర్యాదు

గుడివాడ : వైసీపీ నాయకుల బలవంతంతో తామంతా రాజీనామాలు చేశామని పేర్కొంటూ వలంటీర్లు ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.